క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో..

• లలిత సహస్రనామస్తోత్ర పారాయణం



నెల్లూరు(బృందావనం): జేష్టమాసం సందర్భంగా నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సామూహిక లలిత సహస్రనామ స్తోత్ర పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా యూకేజీ చదువుతున్న చిన్నారి ఎ.ధృవకుమార్ రాజ్ పద్యాలను, స్తోత్రాలను గానం చేసి ప్రశంసలందుకున్నాడు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని ఆ ట్రస్ట్ మేనేజర్ చక్రాల వేంకట లక్ష్మీనరసింహం పర్యవేక్షించారు. లక్ష్మీకా మాక్షి, ఛాయాకుమారి, రాజేశ్వరి, రాధ, నిర్మలకుమారి, భానుమతి, రాజశ్రీ,హరిప్రసాద్‌రావు, సుధాకర్, ప్రభాకర్‌శర్మ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికం తగ్గుముఖం

నెల్లూరు రూరల్: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశంలో పేదరికం గణనీయంగా తగుముఖం పట్టిందని బీజేపీ నేత మిడతల రమేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందని పేర్కొన్నారు. 18 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం మోదీ నాయకత్వంలోనే అందించడం సాధ్యమైందన్నారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తుంటే రాహుల్ గాంధీ తల్లడిల్లిపోతున్నారన్నారు.

ఎవరూ లేని సమయంలో..

• డైకస్‌రోడ్డులో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన కోటమిట్ట డైకస్‌రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. డైకస్‌రోడ్డులో షేక్ నజీర్ అహ్మద్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన ఆదివారం రాత్రి తన భార్యాపిల్లలతో కలిసి కోటమిట్ట ఖతీజా మసీదు సమీపంలోని అత్త ఇంటికి వెళ్లాడు. రాత్రి అక్కడే ఉన్నారు. సోమవారం ఇంటికొచ్చారు. తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లిచూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలోని నాలుగు జతల వెండి పట్టీలు, రెండు వెండి గ్లాస్‌లు, రూ.22 వేల నగదు కనిపించలేదు. నజీర్ చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అబ్దుల్ రజాక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఇంటింటా భగవద్గీత' ప్రచారం అభినందనీయం

నెల్లూరు(బృందావనం): కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలని గీతా వైభవ్ ట్రస్ట్ చైర్మన్ షేక్ నజీర్ బాషా గురూజీ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమని బీజేపీ నేత మిడతల రమేష్ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నజీర్‌బాషా నిర్వహిస్తున్న 'ఇంటింటా భగవద్గీత' కార్యక్రమం సోమవారం మూలాపేట, మహేశ్వరినగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీడీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ జిల్లా సీనియర్ మెడికల్ ఆఫీసర్ కాసాని వెంకటభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న బీడీ, సున్నపురాయి, డోలమైట్, మైకా, ఐరన్‌ఓర్, సినీ కార్మికుల పిల్లలు అర్హులన్నారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, ప్రొఫెషనల్ కోర్సులు చేసే వారు అక్టోబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 040 – 29561297 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వ్యవసాయ సెమినార్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెంగయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరులో వచ్చే నెల 5వ తేదీన నిర్వహించనున్న వ్యవసాయ సెమినార్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంగయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని రైతు సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగయ్య మాట్లాడుత సెమినార్‌కు రైతు సంఘం ఆలిండియా ఉపాధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు అమ్రా రామ్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రి తదితరులు వస్తారన్నారు. రైతులకు స్మార్ట్ విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయకూడదన్నారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని, గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జూలై 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు చంద్ర రాజగోపాల్, శ్రీరాములు, ప్రసాద్, వెంకట కృష్ణయ్య, రమేష్, జనార్దన్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతులిచ్చి.. ఆదుకోవాలని కోరి..

• ఎస్పీ కృష్ణకాంత్



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): చట్ట పరిధిలోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశించారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 88 మంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నగర, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీలు పి.సింధుప్రియ, చెంచు రామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌బీ – 2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

• నాయుడుపేటకు చెందిన సైపుల్లాఖాన్ నన్ను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తన తండ్రికి బ్రెయిన్‌డెడ్ అయ్యి హాస్పిటల్లో ఉన్నారని చికిత్స కోసం రూ.18 లక్షలు తీసుకుని తర్వాత పెళ్లికి నిరాకరించాడు. మోసగాడిపై చర్యలు తీసుకోవాలని ఉలవపాడుకు చెందిన ఓ మహిళ కోరారు.

• నవాబుపేటకు చెందిన అన్వేష్ తాను మైక్రో ల్యాండ్ కంపెనీ మేనేజర్‌నని నమ్మించాడు. కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5.70 లక్షలు తీసుకుని మోసం చేశాడు. విచారించి న్యాయం చేయాలని వేదాయపాళేనికి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

• రూ.5 లక్షలు విలువచేసే మా గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించుకెళ్లారు. వోలేటివారిపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తును వేగవంతం చేసి త్వరలో నిందితులను పట్టుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

• ఇంటినుంచి బయటకు వెళ్లిన నా కుమార్తె నెల రోజుల క్రితం అదృశ్యమైంది. గాలించినా జాడ తెలియరాలేదు. ఆమె ఆచూకీ తెలియజేయాలని కావలికి చెందిన ఓ మహిళ వినతిపత్రమిచ్చారు.

• అదనపుకట్నం కోసం భర్త, అత్తింటివారు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. విచారించి న్యాయం చేయాలని కలిగిరికి చెందిన మహిళ కోరారు.

• కేన్సర్ వ్యాధిగ్రస్తుడైన నన్ను, వృద్ధాప్యంలో ఉన్న నా భార్యను కుమారుడు పట్టించుకోకుండా ఆస్తిని ఆక్రమించుకుని మాపై దాడిచేశాడు. కుమారుడి బారినుంచి రక్షణ కల్పించి తగిన చర్యలు తీసుకోవాలని జలదంకి ప్రాంతానికి చెందిన ఫిర్యాదు చేశాడు.

పెద్దాస్పత్రిలో కార్మికుల ఆందోళన

• పారిశుధ్య కార్మికులను బెదిరించారంటూ ఫిర్యాదు



ఆస్పత్రి వద్ద అనిల్‌తో కార్మికుల వాగ్వాదం

నెల్లూరు(అర్బన్): ఓ పారిశుధ్య కార్మికురాలి కోసం ఆమె బంధువు బెదిరించారంటూ పలువురు కార్మికులు నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో సోమవారం ఆందోళన చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్మికుల కథనం మేరకు.. కాంగ్రెస్ సేవాదళ్ పేరుతో పనిచేస్తున్న కొండా అనిల్ తమ బంధువును ఆస్పత్రిలో కార్మికురాలిగా చేర్పించారు. అయితే ఆమెను కేవలం ఆపరేషన్ థియేటర్‌లోనే విధులు నిర్వర్తించేలా చేశారని, సెలవులు ఇస్తున్నారని తమకు ఎందుకు డ్యూటీలు మార్చడం లేదని రెండురోజుల క్రితం కొందరు కార్మికులు సంబంధిత సూపర్‌వైజర్‌ను ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న అనిల్ ఆస్పత్రికి వచ్చి మీ పనులు మీరు చూసుకోవాలని లేదంటే సంగతి తేలుస్తానని బెదిరించాడని కార్మికులు చెబుతున్నారు. ఈక్రమంలో సోమవారం అనిల్ ఆస్పత్రికి వచ్చాడు. ఆయన మళ్లీ కార్మికులను బెదిరించాడని చెబుతున్నారు. అనిల్‌తో పెద్ద సంఖ్యలో కార్మికులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు మనోజ్ కల్పించుకుని కార్మికులను బెదిరించడం తగదని పేర్కొన్నాడు. ఈ క్రమంలో వాదోపవాదాలు జరిగి ఘర్షణ వాతావరణం రావడంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇదే విషయమై పలువురు కార్మికులు అనిల్‌పై దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పవన్.. కమ్యూనిస్టులతో పొత్తు మరిచిపోయావా?

• సీపీఎం జిల్లా కార్యదర్శి అంకయ్య



మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సినిమాల్లో వేసిన వేషాలు రాజకీయాల్లో కూడా వేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య విమర్శించారు. నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణను విమర్శించే స్థాయి జనసేన, బీజేపీ నేతలకు లేదన్నారు. పవన్ 2019 ఎన్నికల సమయంలో కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకుని తాను భగత్‌సింగ్, చేగువేరా వారసుడినని, తనకు మతం లేదు, అన్ని మతాలు సమానమేనని చెప్పారన్నారు. నేడు బీజేపీతో కలిసి రకరకాల వేషాలు వేస్తున్నాడని ఎద్దేవా చేశారు. మత విద్వేషాలతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. స్వార్థ రాజకీయల కోసం బీజేపీ, జనసేన నాయకులు కులమతాల మధ్య చిచ్చుపెట్టి ఎదగాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, మహిళా సంఘం జిల్లా కన్వీనర్ శీరిషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నీ




విజేతలతో నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఎస్‌వీఎస్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మినీబైపాస్‌రోడ్డు దగ్గర ఉన్న నక్షత్ర స్కూల్లో నిర్వహించిన ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నీ సోమవారం ముగిసింది. ఈ టోర్నీ విజేతగా తమిళనాడుకు చెందిన ఆర్.శైలేష్ (రేటింగ్ 1928), ద్వితీయ, తృతీయ స్థానాల్లో పి.రామకృష్ణ (తెలంగాణ), బాలసుబ్రహ్మణ్యం (తమిళనాడు) నిలిచారు. ముఖ్యఅతిథిగా ఆ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ సందీప్‌రెడ్డి హాజరై బహుమతులు అందజేశారు. విజేతలకు రూ.80 వేలు ప్రోత్సాహక బహుమతిగా ఇచ్చారు. అలాగే వివిధ వయో విభాగాల్లో రాణించిన క్రీడాకారులు, జూనియర్లకు ప్రోత్సాహకంగా ప్రత్యేక బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్, నక్షత్ర స్కూల్ డైరెక్టర్ గాదిరాజు జీవన్‌కృష్ణ, టోర్నీ నిర్వాహకులు చెస్ అకాడమీ డైరెక్టర్ వంశీకృష్ణ, సుధాశ్రీ, సుశీల, చీఫ్ ఆర్బిటర్ ఎం.గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ శాఖలో బదిలీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీసీ వెల్ఫేర్ శాఖలో బదిలీలు జరిగాయి. సోమవారం ఆ శాఖ డైరెక్టర్ మల్లికార్జున ఇచ్చిన ఆదేశాలు మేరకు జిల్లాలోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సాంసన్‌ను గుంటూరు కార్యాలయానికి బదిలీ చేశారు. ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డి జిల్లా సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఆత్మకూరులో పనిచేస్తున్న ఏబీసీడబ్ల్యూఓ శ్రీదేవిని నెల్లూరు డివిజన్‌కు, నాయుడుపేటలో పనిచేస్తున్న కృష్ణయ్యను ఆత్మకూరుకు, ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న జబ్బర్‌ను కందుకూరు డివిజన్‌కు, బాపట్ల జిల్లాలో రేపల్లిలో పనిచేస్తున్న ఏబీసీడబ్ల్యూఓ వి.అరుణమ్మను నెల్లూరు జిల్లా కావలి ఏబీసీడబ్ల్యూఓగా బదిలీ చేశారు.

ఏపీ ఈఏపీలో నారాయణ విజయభేరి



ప్రతిభ చూపిన వారితో నారాయణ యాజమాన్యం

నెల్లూరు(టౌన్): ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో నారాయణ మెడికల్ అకాడమీ విద్యార్థులు విజయభేరి మోగించారని ఆ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి తెలిపారు. సోమవారం హరనాథపురంలోని నారాయణ మెడికల్ అకాడమీలో విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఎస్‌ఈ.కవిన్ 24వ ర్యాంక్, ప్రణీత్‌కల్యాణ్ 116, నిఖిల 170, లలిత్ శ్రీహాస్ 171వ ర్యాంక్ సాధించారన్నారు. 100లోపు ఒకరు, 500 లోపు 18 మంది, 1,000లోపు 28 మంది, 5వేల లోపు 82 మంది ర్యాంకులు పొందారన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో నారాయణ ఐఐటీ అకాడమీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పూర్వజ్ 84వ ర్యాంక్, హేమంత్‌సాయి 90, కె.ఆశ్రిత 105, ఎం.మధుకిరణ్‌రెడ్డి 135, హితేష్‌అభిషేక్ 242, సాయిసాత్విక్ 291, భానురిషిక్ 302, కృష్ణకౌశిక్ 450, హర్షవర్ధన్ 492వ ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. 100లోపు ఇద్దరు, 500 లోపు 9మంది, 1,000లోపు 14 మంది, 2వేల లోపు 33 మంది, 3వేల లోపు 50 మంది, 5వేల లోపు 95 మంది ర్యాంకులు పొందారన్నారు.

చర్యలు తీసుకోవాలంటూ..

నెల్లూరు(టౌన్): ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో అడ్మిషన్లు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ డిమాండ్ చేశారు. సోమవారం ఓ స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఫీజు, పుస్తకాలు, యూనిఫాం పేరుతో నగదు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు. షారూఖ్, ఆశీర్వాదం, నవీన్, పవన్, హర్ష, వంశీ, పవన్ పాల్గొన్నారు.

రేపు శంకరమఠంలో చండీహోమం

నెల్లూరు(బృందావనం): జేష్ట పౌర్ణమిని పురస్కరించుకుని మూలాపేట శంకరమఠంలో బుధవారం ఉదయం 7 గంటలకు చండీహోమం జరుగనుందని ఆ మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శంకరమఠం ప్రాంగణంలో కొలువైన కామాక్షి సమేత చంద్ర మౌళీశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 33/11 కేవీ తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు పనులు చేస్తున్న కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, న్యూమిలటరీ కాలనీ, ఇందిరాగాంధీ నగర్, చైతన్యపురి కాలనీ, సంజయ్‌గాంధీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

మెడికవర్ ఆస్పత్రిలో అవగాహన

నెల్లూరు(అర్బన్): జీర్ణవ్యవస్థ, అందులో భాగమైన పేగులు ఆరోగ్యంగా ఉంటేనే శరీరం మొత్తం బాగుంటుందని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ కె.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పేగుల ప్రాముఖ్యత, జీర్ణ సంబంధిత సమస్యలు, చికిత్సలపై సోమవారం నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీర్ణవ్యవస్థలో ఉండే బ్యాక్టీరియాలు, వైరస్‌లు, ఫంగస్‌లాంటి ట్రిలియన్ సూక్ష్మజీవులు సమతుల్యంగా ఉంటేనే మెరుగైన జీర్ణవ్యవస్థ ఉంటుందన్నారు. అప్పుడే మనం తీసుకున్న ఆహారంలోని పోషకాలను గ్రహించి వాటిని శరీరానికి జీర్ణవ్యవస్థ అందిస్తుందన్నారు. చక్కెర, తక్కువ ఫైబర్ ఉన్న పదార్థాలను వీడాలన్నారు. పీచు పదార్థాలు అధికంగా ఉండే కూరగాయలు, నట్స్ ఆహారంగా తీసుకుంటూ ఎక్కువగా నీరు తాగాలన్నారు. మెడికవర్ ఆస్పత్రిలో పేగు, జీర్ణ వ్యవస్థ, గ్యాస్ట్రిక్‌ట్రబుల్ లాంటి ఆరోగ్య సమస్యలకు అధునాతన వైద్యం అందిస్తున్నామన్నారు.

డిప్యూటీ సీటీఎం నియామకం

నెల్లూరు సిటీ: ఆర్టీసీ నెల్లూరు రీజియన్ డిప్యూటీ సీటీఎంగా షేక్ షమీమ్‌ను నియమిస్తూ ట్రాన్స్‌పోర్ట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. షమీమ్ ప్రస్తుతం నెల్లూరు జోన్ కార్యాలయంలో ఆపరేషన్స్, కమర్షియల్ విభాగంలో పనిచేస్తున్నారు. కాగా ఈమె స్థానంలో గుంటూరు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎం.రవికాంత్‌ను బదిలీ చేశారు.

జెడ్పీలో బదిలీల కౌన్సెలింగ్

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ విద్యారమ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరిగింది. పరిపాలనా అధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు ల్యాబ్ అసిస్టెంట్లకు, అటెండర్లకు బదిలీలు చేశారు. డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

• కమిషనర్ వైఓ నందన్



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్, అధికారులు

నెల్లూరు(బారకాసు): సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ వైఓ నందన్ తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. 79 ఫిర్యాదులు అందుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఇంజినీరింగ్ శాఖకు సంబంధించి 7, హౌసింగ్‌వి 47, టౌన్ ప్లానింగ్‌వి 10, రెవెన్యూవి 2, పబ్లిక్ హెల్త్‌వి 4, అకౌంట్ సెక్షన్‌వి 3 తదితర వినతులందాయి. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్‌మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

⇨ ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా వెంకటేశ్వరపురం, పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటుచేసి కేవలం రూ.2కే 20 లీటర్ల స్వచ్ఛమైన మినరల్ వాటర్ తాగునీటిని అందజేస్తున్నామని కమిషనర్ తెలిపారు. అన్ని డివిజన్లో త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. కాలువల్లో పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలను మంజూరు చేయనున్నామని చెప్పారు.

మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరం



పట్టుబడిన వాహనాలతో పోలీస్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య అన్నారు. ఆదివారం రాత్రి స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పలువురు మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడగా వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోమవారం పోలీసుస్టేషన్‌లో బైక్ నడుపుతూ పట్టుబడిన మైనర్లకు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం ఎంత నేరమో.. పిల్లలకు వాహనాలు ఇవ్వడం కూడా అంతే నేరమన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే మైనర్లతోపాటు తల్లిదండ్రులపై సైతం కేసులు తప్పవన్నారు. డ్రైవ్‌లో ఎస్సైలు బ్రహ్మయ్య, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.50 కోట్లతో పూడికతీత పనులు

• మంత్రి నారాయణ



పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ఉన్న మురుగు కాలువల్లో రూ.50 కోట్లతో పూడికతీత పనులు కొనసాగుతున్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని బాలాజీ నగర్ మసీదు సెంటర్‌లో సైడ్ డ్రెయిన్ల పూడికతీత పనులను మంత్రి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ నాటికి చెత్తను తొలగించాలని సీఎం ఆదేశించారన్నారు. చెత్త రీసైక్లింగ్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. నెల్లూరు అల్లీపురం డంపింగ్ యార్డులో చెత్తను తొలగించి పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. పినాకినీ పార్కులో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. మరో నాలుగు స్కూళ్లను వీఆర్ హైస్కూల్ తరహాలో చేసేందుకు కంపెనీలు ముందుకొచ్చాయన్నారు. కొంత ఓపిక పడితే హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. రెండేళ్లలో నెల్లూరు సిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ చైతన్యకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి



ఆత్మకూరు బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలని పలువురు నేతలు అన్నారు. సీపీఎం నెల్లూరు నగర, రూరల్ కమిటీ, కార్మిక సంఘాల ఐక్యవేదిక, విశాఖ స్టీల్ ప్లాంట్ పోరాట పరిరక్షణ ఐక్యవేదికల ఆధ్వర్యంలో సోమవారం ధర్నాలు నిర్వహించారు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద నగర కమిటీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఆర్టీసీ బస్టాండ్ వద్ద రూరల్ కమిటీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న 4,500 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని కేంద్రం నిర్ణయించిందని ఆరోపించారు. దీంతో ఉత్పత్తి తగ్గి ప్లాంట్‌ను మూసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీలు విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు అండగా ఉంటామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మాట్లాడకపోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే విశాఖ ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించి, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీవీవీ ప్రసాద్, శంకర్ కిశోర్, అజయ్‌కుమార్, పెంచలనరసయ్య, కత్తి శ్రీనివాసులు, సురేష్, సూర్యనారాయణ, మూలం ప్రసాద్, రాంబాబు, మురళి, శరవణ, కొండాప్రసాద్, గోపాల్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి బాటలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, అధికారులు

నెల్లూరు రూరల్: పీ4 విధానానికి శ్రీకారం చుట్టి రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి బాటలు వేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి ఎంపీ, ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రఘురామయ్య తదితరులు హాజరయ్యారు. అనంతరం వేమిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ మన జిల్లాలో ఆక్వారంగం బాగుందని, దీని అభివృద్ధికి పీ4 విధానాన్ని జోడిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం



120 పరుగులు చేసిన కీర్తి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏపీఏ మహిళల అండర్ – 15 సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరు సీఏపీ గ్రౌండ్‌లో మొదలైన పోటీల్లో అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి. మొదటి మ్యాచ్ చిత్తూరు, నెల్లూరు జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌ను ఎంచుకుంది. నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు చేసింది. ఈ జట్టులో గేయకీర్తి 120 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 118 పరుగులు మాత్రమే చేసింది. చిత్తూరు జట్టు నెల్లూరు జట్టుపై విజయం సాధించింది. రెండో మ్యాచ్ అనంతపురం, కర్నూలు జట్ల మధ్య జరిగింది. ఇందులో కర్నూలు జట్టు గెలిచింది. పోటీలను ఎస్‌డీసీఏ అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి, జనరల్ మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు లీలా మోహన్‌రెడ్డి, అంపైర్లు పవన్ కిశోర్, త్రినాథ్ పర్యవేక్షించారు.